## సంయమనం పాటించండి

**భారత్, పాక్‌కు ఐక్యరాజ్యసమితి పిలుపు**

ఐక్యరాజ్యసమితి, ఏప్రిల్ 25: భారత్, పాకిస్థాన్ మధ్య తలెత్తిన ఉద్రిక్త పరిస్థితిని అత్యంత నిశితంగా పరిశీలిస్తున్నామని, రెండు దేశాలు పూర్తి సంయమనం పాటించాలని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గెటెరస్ కోరారు. పరిస్థితి మరింత దిగజార్చే చర్యలు చేపట్టవద్దని రెండు దేశాలకు విజ్ఞప్తి చేశారు. పెద్ద సంఖ్యలో పహల్గాం ఉగ్రదాడిని తాము ఖండిస్తున్నట్లు సెక్రటరీ జనరల్‌కు చెందిన అధికార ప్రతినిధి స్టీఫెన్ దుజారిక్ తెలిపారు.

## కశ్మీర్‌లోని స్థానికేతరులపై ఉగ్ర మూకల గురి!

**నిఘా వర్గాల హెచ్చరిక**

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రవాద దాడి సృష్టించిన జ్వాలలు రగులుతుండగానే నిఘా వర్గాలు ఓ హెచ్చరిక చేశాయి. జమ్ముకశ్మీరులోని స్థానికేతరులను లక్ష్యంగా చేసుకుని పాకిస్థాన్ ఐఎస్ఐ (ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్), దాని అనుబంధ ఉగ్రవాద సంస్థలు దాడులు చేసే అవకాశం ఉన్నట్లు తెలిపాయి. పర్యాటకులు, స్థానికేతరులు, కశ్మీరీ పండిట్లు, పోలీసులు, రైల్వే ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించాయి. ముఖ్యంగా శ్రీనగర్, గందర్‌బల్ జిల్లాల్లో ఉన్నవారిపై, అదేవిధంగా, రైలు పట్టాలు, రైల్వే శాఖకు చెందిన నిర్మాణాలు వంటి వాటిపై దాడులు జరగవచ్చునని తెలిపాయి.



పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ శుక్రవారం జమ్ముకశ్మీర్‌లో పర్యటించారు. శ్రీనగర్‌లో స్థానికులతో మాట్లాడారు.

# సరిహద్దుల్లో ఉద్రిక్తత

- ఎల్వోసీ వెంబడి కాల్పులకు తెగబడ్డ పాకిస్థాన్ సైన్యం
- సమర్థంగా తిప్పికొట్టిన భారత భద్రతా బలగాలు
- భారత్-పాకిస్థాన్ సరిహద్దులు మూసివేత
- కశ్మీరు అంతటా భారీగా బలగాల మోహరింపు
- పారామిలిటరీ బలగాలకు సెలవులు రద్దు చేసిన కేంద్రం



న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో భారత్, పాకిస్థాన్ సరిహద్దుల్లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గురువారం రాత్రి జమ్ముకశ్మీర్‌లోని వాస్తవాధీన రేఖ (ఎల్వోసీ) వెంబడి పాకిస్థాన్ సైనికులు కాల్పులకు తెగబడ్డారు. వీటిని భారత దళాలు సమర్థంగా తిప్పికొట్టాయి. అయితే ఈ కాల్పుల్లో ఎటువంటి ప్రాణనష్టం వాటిల్లలేదని సైనిక వర్గాలు వెల్లడించాయి. దేశంలోని పారామిలిటరీ దళాలకు రక్షణ శాఖ సెలవులు రద్దు చేసింది. సెలవులపై వెళ్లిన జవాన్లు వెంటనే రిపోర్ట్ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు.

**సరిహద్దులు మూసివేత**

జమ్ములోని సుచేత్‌గఢ్ వద్ద భారత్-పాకిస్థాన్ సరిహద్దును పౌరులకు మూసివేశారు. సుచేత్‌గఢ్‌లోని ఆక్ట్రాయ్ పోస్టు వద్ద పౌర కదలికలను సరిహద్దు భద్రతా సిబ్బంది(బీఎస్ఎఫ్) శుక్రవారం నిలిపివేసింది. పంజాబ్‌లోని భారత్-పాక్ సరిహద్దు వెంబడి ఉన్న అటారీ, హుస్సేనీవాలా, సడ్కీ వద్ద రిట్రీట్ కవాతులను రద్దు చేసినట్లు బీఎస్ఎఫ్ ప్రకటించిన నేపథ్యంలో సుచేత్‌గఢ్ వద్ద తాజా పరిణామాలు చోటు చేసుకున్నాయి. సుచేత్‌గఢ్‌లో కూడా రిట్రీట్ కవాతు జరగడం సంప్రదాయంగా వస్తోంది. భారత అంతర్జాతీయ సరిహద్దు ఉత్తరాన జమ్ము నుంచి ప్రారంభమై పంజాబ్, రాజస్థాన్ మీదుగా పశ్చిమాన గుజరాత్ వరకు వెళుతుంది. సీమాంతర ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితిలోనూ ఉపేక్షించబోమన్న భారత్ సంకల్పాన్ని తాజా పరిణామాలు ప్రతిబింబిస్తున్నాయి.

**జమ్ముకశ్మీర్‌లో భద్రత కట్టుదిట్టం**

జమ్ముకశ్మీర్ పరిస్థితులపై చర్చించడానికి అన్ని సైనిక విభాగాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. జమ్ము కశ్మీరు వ్యాప్తంగా భద్రతా దళాలు మోహరించాయి. శ్రీనగర్‌లోని విమానాశ్రయంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. కశ్మీరులో పరిస్థితిని సమీక్షించేందుకు భారత సైన్యాధిపతి ఉపేంద్ర ద్వివేది శ్రీనగర్ చేరుకున్నారు.

**సరిహద్దుల వద్ద పాక్ భారీగా బలగాలు**

పహల్గాం ఉగ్ర దాడి దరిమిలా భారత్‌తో ఉద్రిక్తతలు తీవ్రతరమైన నేపథ్యంలో పాకిస్థాన్ సైన్యం శుక్రవారం గతన సిబ్బందికి ఇచ్చిన సెలవులను రద్దు చేసింది. రానున్న రోజుల్లో ఎవరికీ కొత్త సెలవులు మంజూరు చేయవద్దని సైనిక త్రివిధ దళాలకు చెందిన కమాండర్లను ఆదేశించింది. గతంలో అఫ్గానిస్థాన్, బలూచిస్థాన్‌కు సరిహద్దు భద్రతను నిర్వహించిన సైనిక సిబ్బందిని భారత్-పాకిస్థాన్ సరిహద్దు వద్ద పాక్ నియమించినట్లు కూడా వార్తలు వచ్చాయి. 10 కోర్ కమాండర్ పరిధిలోని భారత్-పాక్ వాస్తవాధీన రేఖ సమీపంలో గణనీయమైన సంఖ్యలో సైనిక సిబ్బందిని నియమించాలని బలూచిస్థాన్, అఫ్గానిస్థాన్ సరిహద్దుల్లో నియమించిన 11 కోర్, 12 కోర్‌కు చెందిన కమాండర్లను పాక్ సైన్యం ఆదేశించింది. భారత్ నుంచి చొరబాటు ఉండని కారణంగా గతంలో ఎన్నడూ వాస్తవాధీన రేఖ వెంబడి భారత్-పాక్ సరిహద్దు సైనిక బలగాలను పాక్ నియమించలేదు.

**పహల్గాం నిందితుల కోసం వేట**

పహల్గాంలో పర్యాటకులపై దాడికి పాల్పడిన అనుమానిత ఉగ్రవాదులను చూశానని ఓ మహిళ చెప్పడంతో జమ్ము కశ్మీర్‌లోని కథువాలో శుక్రవారం ప్రత్యేక పోలీస్ బృందం గాలింపు చేపట్టింది. పుల్వామా, బారాముల్లాలోనూ అనుమానిత టెర్రరిస్టుల కోసం వేట కొనసాగుతున్నది. భారత వ్యతిరేక ఉగ్రవాద సంస్థగా ఆరోపణలున్న జేకేఎన్ఎఫ్ కార్యకలాపాలపైనా సోదాలు ప్రారంభమయ్యాయి. పట్టాన్‌లోని గులామ్ మొహమ్మద్ గనేయి ఇంట్లో పోలీసులు సోదాలు చేశారు. అక్కడ లభించిన జేకేఎన్ఎఫ్ సామగ్రిని సీజ్ చేశారు.

## పాకిస్థానీయులను గుర్తించి.. పంపించేయండి

- అన్ని రాష్ట్రాల సీఎంలకు అమిత్ షా ఆదేశాలు
- 14 రకాల వీసాల రద్దు
- గడువులోగా దేశాన్ని వీడాలని పాకిస్థానీయులకు నిర్దేశం



న్యూఢిల్లీ: పాకిస్థానీ జాతీయులందరినీ గుర్తించి వారిని వెంటనే వారి స్వదేశానికి పంపించివేయాలని కేంద్ర హోం శాఖ అన్ని రాష్ట్రాలను కోరింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా అందరు ముఖ్యమంత్రులతో మాట్లాడినట్లు శుక్రవారం అధికార వర్గాలు వెల్లడించాయి. జమ్ముకశ్మీరులోని పహల్గాంలో 26 మంది పర్యాటకులను బలిగొన్న ఉగ్రవాదుల పాశవిక దాడి నేపథ్యంలో పాకిస్థాన్‌పై ఐదు అంచెల దౌత్యపరమైన ప్రతీకార చర్యలను చేపట్టిన భారత ప్రభుత్వం అందులో భాగంగా పాక్ జాతీయులకు చెందిన అన్ని రకాల వీసాలను రద్దు చేస్తున్నట్లు బుధవారం ప్రకటించింది. ఏప్రిల్ 27 నుంచి వీసాలు రద్దవుతాయని విస్పష్ట ప్రకటన చేసిన భారత్ మెడికల్ వీసాలకు మాత్రం అదనంగా 48 గంటల గడువు ఇచ్చింది.

**గడువులోగా దేశాన్ని వీడండి**

పాకిస్థానీ జాతీయులకు జారీచేసిన 14 రకాల వీసాలను భారత ప్రభుత్వం శుక్రవారం రద్దు చేసింది. వీటిలో వ్యాపారం, సమావేశాలు, పర్యాటక, యాత్రలు, వైద్యం తదితర అంశాలకు చెందినవి ఉన్నాయి. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్ జాతీయులకు వీసాలను రద్దు చేసినట్లు కేంద్ర హోం శాఖ ప్రకటించింది.

**పాక్‌కు చుక్క నీటినీ వెళ్లనీయం**

పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ నుంచి పాకిస్థాన్‌కు చుక్క నీటిని కూడా వెళ్లనీయమని కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ తెలిపారు. ఉగ్రదాడి పరిణామాల నేపథ్యంలో హోం మంత్రి అమిత్ షా నేతృత్వంలో శుక్రవారం జరిగిన ఉన్నత స్థాయి సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ ఉగ్రదాడికి వ్యతిరేకంగా ప్రధాని మోదీ పలు ఆదేశాలను జారీ చేశారని, వాటిని సమర్థవంతంగా అమలు చేస్తామని తెలిపారు. సింధూ జలాల ఒప్పందాన్ని రద్దు చేస్తూ తీసుకున్న చారిత్రక నిర్ణయం పూర్తి సమర్థనీయమైనదని ఆయన అన్నారు. కాగా, సింధూ జలాలు పాకిస్థాన్‌లోకి వెళ్లకుండా అడ్డుకునే ప్రయత్నాలను భారత్ మొదలు పెట్టినట్టు సమాచారం.

## లష్కరే టాప్ కమాండర్ హతం

**బందిపొరాలో ఎన్‌కౌంటర్ ▪ ఇద్దరు పోలీసులకు గాయాలు**



న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: పహల్గాం ఉగ్ర దాడి వెనుక ఉన్న సూత్రధారులను మట్టుబెట్టే ఆపరేషన్‌లో భారత్ తొలి విజయం సాధించింది. జమ్ము కశ్మీరులోని బందిపొరాలో శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో లష్కరే తాయిబా టాప్ కమాండర్ అల్తాఫ్ లల్లీ హతమయ్యాడు. 26 మంది పర్యాటకులను బలిగొన్న పహల్గాం ఉగ్రదాడితో సంబంధం ఉన్నట్లు అనుమానిస్తున్న లష్కరే తాయిబా ఉగ్రవాదుల కోసం భద్రతా దళాలు పెద్ద ఎత్తున గాలింపు చేపట్టాయి. బందిపొరాలో కొందరు ఉగ్రవాదులు దాగి ఉన్నట్లు నిఘా వర్గాల నుంచి సమాచారం అందుకున్న భారత సైన్యం, జమ్ము కశ్మీరు పోలీసులు సంయుక్తంగా శుక్రవారం ఉదయం ఆపరేషన్ చేపట్టారు. ఉగ్రవాదులు దాక్కుని ఉన్న ప్రదేశాన్ని చుట్టుముట్టారు. ఉగ్రవాదులు కాల్పులు ప్రారంభించడంతో ప్రతిగా భద్రతా దళాలు ఎదురుకాల్పులు జరిపాయి. ఈ కాల్పుల పోరులో ఓ సీనియర్ అధికారికి చెందిన వ్యక్తిగత భద్రతా బృందంలోని ఇద్దరు పోలీసు సిబ్బంది గాయపడ్డారు. భద్రతా దళాల ఎదురుకాల్పులలో లష్కరే తాయిబా టాప్ కమాండర్ అల్తాఫ్ లల్లీ మరణించాడు. బందిపొరాలోజరుగుతున్న ఆపరేషన్ గురించి శ్రీనగర్ చేరుకున్న ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదీకి అధికారులు వివరించారు.

## బలగాలకు టెర్రరిస్టుల ట్రాప్!

- ఇళ్లలో ఐఈడీలు పెట్టి యాక్టివేట్
- త్రుటిలో తప్పించుకున్న భద్రతా సిబ్బంది
- ఇద్దరు టెర్రరిస్టుల ఇళ్లు ధ్వంసం



అనంత్‌నాగ్ జిల్లాలో పేలుళ్లలో ధ్వంసమైన ఉగ్రవాది ఆదిల్ నివాసం

శ్రీనగర్, ఏప్రిల్ 25: ఉగ్రవాదులు పన్నిన ట్రాప్ నుంచి భద్రతా దళాలు త్రుటిలో తప్పించుకోవడంతో ప్రాణనష్టం తప్పింది. పహల్గాం దాడిలో ఒక నిందితుడైన ఆసిఫ్ ఫౌజీ.. దక్షిణ కశ్మీర్‌లోని త్రాల్‌లో ఉన్న తన ఇంటిని వెతుక్కుంటూ భద్రతా దళాలు వస్తాయని ఊహించి వారు రాగానే యాక్టివేట్ అయ్యేలా ఐఈడీలు ఉంచాడు. అతను ఊహించినట్టే ఇంటిని తనిఖీ చేయడానికి జమ్ముకశ్మీర్ పోలీసులు వెళ్లారు. వారు ఇంట్లోకి రాగానే పేలుడు పదార్థాలు యాక్టివ్ అయ్యాయి. ఇది గుర్తించిన పోలీసులు వెంటనే బయటకు వచ్చిన కాసేపటికే భారీగా పేలుళ్లు సంభవించాయి. మరో ఉగ్రవాది ఆదిల్ థోకర్ ఇంట్లో కూడా ఇలాగే బాంబు ద్వారా ట్రాప్ పెట్టినా పోలీసుల అప్రమత్తతతో ప్రమాదం తప్పింది. ఈ పేలుళ్లతో ఇద్దరు ఉగ్రవాదుల ఇళ్లు ధ్వంసమయ్యాయి.

## జవాన్ అప్పగింతకు పాక్ నిరాకరణ

- *మూడో రోజూ జరగని చర్చలు*
- *తమ కుమారుడిని క్షేమంగా తీసుకురావాలని తండ్రి అభ్యర్థన*

*న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: పొరపాటున పాకిస్థాన్ సరిహద్దుల్లోకి చొరబడిన బీఎస్ఎఫ్ జవాన్‌ను అప్పగించేందుకు పాకిస్థాన్ రేంజర్లు వరుసగా మూడవ రోజు నిరాకరించారు. ఆ జవాన్ ఆచూకీ చెప్పడానికి కూడా రేంజర్లు ఇష్టపడడం లేదని అధికార వర్గాలు శుక్రవారం తెలిపాయి. పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ జిల్లా వెంబడి ఉన్న ఓ పొలంలో బీఎస్ఎఫ్‌కు చెందిన జవాన్ కానిస్టేబుల్ పూర్ణం సాహును పాకిస్థాన్ రేంజర్లు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. జవాన్ విడుదల కోసం పాక్ రేంజర్లను పలుమార్లు సంప్రదించి చర్చలను కోరినప్పటికీ అవతలి వైపు నుంచి ఇప్పటి వరకు సానుకూల స్పందన లేదు. పహల్గాం ఉగ్ర దాడి తర్వాత రెండు దేశాల మధ్య సంబంధాలు క్షీణించిన తరుణంలో ఈ ఘటన జరగడం ఆందోళన కలిగిస్తోంది. జవాన్ విడుదల కోసం రేంజర్లతో ఫీల్డ్ కమాండర్ స్థాయి సమావేశం నిర్వహించాలని బీఎస్ఎఫ్ పాక్‌ను కోరుతూనే ఉందని వర్గాలు తెలిపాయి. సాహు క్షేమంగా తిరిగిరావాలని పశ్చిమ బెంగాల్ హూగ్లీలో నివసిస్తున్న అతని కుటుంబ సభ్యులు ప్రార్థిస్తున్నారు. తన కుమారుడు దేశానికి సేవ చేస్తున్నాడని, అతను క్షేమంగా ఉన్నాడో లేడో కూడా తమకు తెలియడం లేదని సాహు తండ్రి భోలానాథ్ సాహు తెలిపారు. అతను పాకిస్థానీ బందీగా ఉన్నట్లు తమకు తెలిసిందని ఆయన చెప్పారు. తమ కుమారుడిని క్షేమంగా తీసుకురావాలని ఆయన అధికారులను కోరారు.*

## పాక్‌లో ఉగ్రవాదులున్నది నిజమే

- వారికి నిధులు, శిక్షణ అందిస్తున్నది వాస్తవమే
- అమెరికా కోసమే ఈ చెత్త పనులన్నీ చేశాం
- అంగీకరించిన పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా
- భారత్ దాడి చేస్తే, ఈ సారి పూర్తి యుద్ధమేనని వ్యాఖ్య



ఆసిఫ్

ఇస్లామాబాద్, ఏప్రిల్ 25: తమ దేశంలో ఉగ్రవాదులు లేరంటూ ఇన్నాళ్లు బుకాయిస్తూ వస్తున్న పాకిస్థాన్.. ఇప్పుడు అంతర్జాతీయ మీడియా సాక్షిగా యూటర్న్ తీసుకుంది. గత మూడు దశాబ్దాలపాటు ఉగ్రవాద సంస్థలకు నిధులు, ఉగ్రవాదులకు శిక్షణ అందిస్తున్నది నిజమేనని అంగీకరించింది. ఆ దేశ రక్షణ శాఖ మంత్రి ఖవాజా ఆసిఫ్ బహిరంగంగా ఈ విషయాన్ని ఒప్పుకున్నారు. అయితే ఆ పాపానికి అమెరికా, పశ్చిమ దేశాలే కారణమని ఆరోపించారు. స్కైన్యూస్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మంత్రి చేసిన ప్రకటనతో పాక్‌ను ఉగ్రదేశమని, ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్నదని భారత్ చేస్తున్న ఆరోపణలు నిజమేనని మరోసారి రుజువైంది.

**అమెరికా, పశ్చిమదేశాల కోసమే..**

జమ్ముకశ్మీర్‌లోని పెహల్గాంలో టెర్రరిస్టు దాడిలో పరోక్షంగా పాకిస్థాన్‌దే బాధ్యత అని భారత్ ఇప్పటికే పేర్కొనగా, పహల్గాం దాడిని భారతే నాటకంగా తెరకెక్కించిందని ఖవాజా ఆరోపించారు. చాలాకాలంగా ఉగ్రవాద సంస్థలు, ఉగ్రవాదులకు మద్దతు ఇస్తున్న చరిత్ర పాకిస్థాన్‌కు ఉంది కదా? అని జర్నలిస్టు యాల్దా హకీమ్ ప్రశ్నించగా, 'మేము ఈ పాడుపనిని గత మూడు దశాబ్దాలుగా అమెరికా, బ్రిటన్, ఇతర పశ్చిమ దేశాల కోసం చేస్తున్నాం' అని ఆయన పేర్కొన్నారు. తాము ఇన్నాళ్లుగా చేసింది తప్పేనని ఆయన తెలిపారు. సోవియట్ యూనియన్, అఫ్గాన్‌లపై దండయాత్రలకు ఉగ్రవాదులను అమెరికా పావుగా వాడుకుందని ఆరోపించారు.

**లష్కర్ తాయిబా ఉనికే లేదు**

తమ దేశంలో లష్కరే తాయిబా సంస్థ ఉనికే లేదని మంత్రి స్పష్టం చేశారు. లష్కర్ అనేది పాత పేరని, ఇప్పుడది ఉనికిలోనే లేదని ఆయన పేర్కొన్నారు. 2019లో జరిగిన బాలాకోట్ తరహాలో పాకిస్థాన్‌పై భారత్ వైమానిక దాడి జరిపే అవకాశం ఉందా? అన్న ప్రశ్నకు, అలాంటి ప్రయత్నమే కనుక పునరావృతం అయితే ఈసారి పూర్తిస్థాయి యుద్ధం జరుగుతుందని హెచ్చరించారు. అయితే రెండు అణ్వాయుధ శక్తుల మధ్య ఘర్షణ ఎప్పుడూ ఆందోళనకరమైనదేనని మంత్రి ఆసిఫ్ అన్నారు.

## పహల్గాం దాడిలో హమాస్ హస్తం?

**పలుసార్లు పీవోకేను సందర్శించిన నేతలు**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: పహల్గాం ఉగ్రదాడిలో పాకిస్థాన్ టెర్రరిస్టులకే కాక మరికొందరి హస్తం కూడా ఉంచవచ్చునన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ జరిపిన దాడి తరహాలోనే ఇప్పుడు పహల్గాంలో కూడా దాడి జరిగినట్టు పోలికలు కన్పించడంతో పాటు, గత ఏడాది కాలంలో హమాస్‌కు చెందిన పలువురు సీనియర్ నేతలు పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)ను సందర్శించినట్టు వెలుగులోకి రావడంతో ఈ అనుమానాలు మరింత బలపడుతున్నాయి. టైమ్స్ ఆఫ్ ఇండియా ప్రచురించిన నివేదిక ప్రకారం జైషే మహమ్మద్ హెడ్‌క్వార్టర్స్ ఉన్న బహల్వపూర్‌ను హమాస్ బృందం ఇటీవల సందర్శించింది. కశ్మీర్ సంఘీభావ దినం సందర్భంగా పీవోకేలోని రావల్‌కోట్‌లో జరిగిన ర్యాలీలో హమాస్ నేతలు ప్రసంగించారు. ఎల్ఈటీ, జైషే మహ్మద్ నేతలు కూడా దీనికి హాజరయ్యారు. ఇవన్నీ చూస్తుంటే పహల్గాం దాడి విషయంలో వీరి హస్తం, సహకారం కూడా ఉందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# ఉగ్రదాడి ఘటన.. సిగ్గుచేటు!

- ఈ దాడితో పాకిస్థాన్ మన చెంపపై చాచి కొట్టింది
- ప్రకటనలు, ఊహా చిత్రాలతో సరిపెట్టడమేంటి?
- రిక్రూట్‌మెంట్ లేకపోవడంతోనే ఆర్మీ బలహీనం
- పహల్గాం ఉగ్రదాడికి నిఘా వైఫల్యమే కారణం
- బీజేపీ సర్కారుపై మాజీ ఆర్మీ చీఫ్‌ల మండిపాటు
- ఉగ్రవాదం అంతమైందన్నారు.. ఇదేంటి?: పవార్

*(స్పెషల్ టాస్క్ బ్యూరో)*

*హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): పహల్గాం ఉగ్రదాడి ఘటనపై యావత్తు జాతి ఆగ్రహావేశాలతో రగిలిపోతున్నది. 26 మంది అమాయకులను బలితీసుకొన్న ముష్కరులను శిక్షించాల్సిందేనంటూ సోషల్ మీడియాలో పెద్దయెత్తున పోస్టులు కనిపిస్తున్నాయి. ఇదే సమయంలో పర్యాటకులకు కనీస భద్రతను కల్పించడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఫల్యంపై కూడా పలువురు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో పహల్గాం ఉగ్రదాడి ఘటన ఓ సిగ్గుచేటని, నిఘా వైఫల్యం వల్లే ఈ దాడి జరిగిందని మాజీ ఆర్మీ చీఫ్‌లు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఖరిని పరోక్షంగా తప్పుబడుతున్నారు. ఇంతటి ఘాతుకానికి తెగబడిన పాక్‌పై ఆంక్షల ప్రకటనలు, ఉగ్రవాదుల ఊహాచిత్రాలను విడుదల చేసి ప్రభుత్వం చేతులు దులుపుకోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం ఫెయిల్ అయ్యిందని మండిపడుతున్నారు.*



***రిక్రూట్‌మెంట్ కూడా లేదు***



*పహల్గాం ఉగ్రదాడి ఘటన మనకు నిజంగా సిగ్గుచేటు. ఈ ఘటనతో పాకిస్థాన్ మన చెంపపై చాచి కొట్టింది. పాక్ చర్యలను బట్టి చూస్తే.. మనతో యుద్ధానికి 'సై' అన్నట్టే కనిపిస్తున్నది. అయితే, ఉగ్ర దాడి ఘటనలో మనం అమాయకులను పోగొట్టుకొన్నాం. మరణాల ప్రకటనపై నాన్చివేత ధోరణి ప్రదర్శించడమెందుకు? ఇక, యూరి, పుల్వామా తర్వాత దీన్ని మనకు జరిగిన మరో పెద్ద అవమానంగానే భావించాలి. దీనికి బదులుగా మనం ఏం చేయాలి? కానీ, మనం ఏం చేశాం? పాక్‌పై ఏవో దౌత్యపరమైన ఆంక్షలు విధిస్తూ.. ఉగ్రవాదుల ఊహా చిత్రాలను విడుదల చేశాం. ఇది కరెక్టేనా? దేశ ప్రజలందరూ పాక్‌కు తగినరీతిలో బుద్ధి చెప్పాలని కోరుకొంటున్నారు. అదే జరగాలి. ఇక్కడ మరో విషయం మనం గుర్తించి తీరాలి. గడిచిన మూడేండ్లుగా సైన్యంలో రిక్రూట్‌మెంట్ నిలిచిపోయింది. 1.8 లక్షల పోస్టులు ఖాళీ అయ్యాయి. దీంతో సైన్యంపై ఒత్తిడి పెరుగుతున్నది. రిక్రూట్‌మెంట్ నిలిచిపోవడంతో సైన్యం బలహీనపడింది కూడా. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఉన్నది.*

*– మేజర్ జనరల్ (రిటైర్డ్) జీడీ బక్షీ*



***నిఘా వైఫల్యమే!***

*నిఘా వైఫల్యం వల్లే పహల్గాం ఉగ్రదాడి జరిగిందని నేను అనుకొంటున్నా. వైఫల్యానికి కారణమైన వాళ్లే జరిగిన పరిణామాలకు బాధ్యత వహించాలి. ఉగ్ర దాడికి పాకిస్థానే కారణం.పాక్‌పై దౌత్యపరమైన ఆంక్షలు సరిపోవు. ప్రతిఘటన ఉండాల్సిందే.*

*– మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ (రిటైర్డ్) శంకర్ చౌదరీ*



***కశ్మీర్‌లో శాంతి తాత్కాలికమే***

*కశ్మీర్‌లో మొన్న ఎన్నికలు జరిగాయి. పర్యాటకుల సంఖ్య పెరిగింది. దీంతో కశ్మీర్‌లో శాంతి అనేది తాత్కాలికమే అని చూపించడానికే పహల్గాంలో ఉగ్రవాదులు దాడులు చేశారు.*

*– ఈస్టర్న్ కమాండ్ మాజీ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్) రాణా ప్రతాప్*



***తక్షణ చర్యలు అవసరం***

*కశ్మీర్‌లో ఉగ్రవాదం అంతమైందంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రకటించింది. మరి, పహల్గాంలో ఉగ్రదాడి జరగడమేంటి? భద్రతాపరమైన లోపాల వల్లే ఈ దాడి జరిగింది. దిద్దుబాటు చర్యలు తీసుకోవడం ఇప్పుడు అత్యవసరం.*

*– ఎన్సీపీ (ఎస్పీ) చీఫ్ శరద్ పవార్*

# మనమే 'పవర్' ఫుల్!

**సైనిక, ఆయుధ సంపత్తిలో పాక్ కంటే భారత్ ముందంజ**



*(స్పెషల్ టాస్క్ బ్యూరో)*

*హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): పహల్గాం ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో భారత్, పాకిస్థాన్ మధ్య సంబంధాలు పూర్తిగా దిగజారాయి. ఒప్పందాల నిలిపివేత, పౌరుల గెంటివేత వంటి కఠిన నిర్ణయాలను ఇరు దేశాలూ తీసుకొన్నాయి. ఈ క్రమంలో భారత్-పాక్ మధ్య సైనిక చర్య ఉండొచ్చన్న ఊహాగానాలు గట్టిగా వినిపిస్తున్నాయి. దీంతో ఆయుధ సంపత్తి, సైన్యం పరంగా ఏ దేశం శక్తిమంతంగా ఉందన్నదానిపై చర్చ మొదలైంది. గ్లోబల్ ఫైర్ పవర్ 2025 నివేదిక ప్రకారం.. సైనిక శక్తి జాబితాలో భారత్ నాలుగో స్థానంలో ఉండగా.. పాక్ 12వ స్థానానికి పరిమితమైంది. దీంతో ఆయుధ సంపత్తి, సైనిక శక్తి విషయంలో పాక్ కంటే భారత్ ఎంతో ముందంజలో ఉన్నట్టు అర్థమవుతున్నది.*



గ్లోబల్ ఫైర్ పవర్ ర్యాంక్ — భారత్ 4



గ్లోబల్ ఫైర్ పవర్ ర్యాంక్ — పాక్ 12

| | భారత్ | పాక్ |
|---|---|---|
| రక్షణ బడ్జెట్ | రూ. 6.8 లక్షల కోట్లు | రూ. 2.2 లక్షల కోట్లు |
| సైనికులు | 51,37,550 | 16,55,000 |
| యుద్ధ ట్యాంకులు | 4,201 | 2,627 |
| సాయుధ వాహనాలు | 1,48,594 | 49,530 |
| **ఎయిర్‌ఫోర్స్** | | |
| మొత్తం విమానాలు | 2,229 | 1,399 |
| ఫైటర్ జెట్స్ | 513 | 328 |
| ఏరియల్ ట్యాంకర్స్ | 6 | 4 |
| హెలికాప్టర్స్ | 899 | 373 |
| అణ్వస్త్ర క్షిపణులు | 180 | 170 |
| **నావికా దళం** | | |
| యుద్ధ నౌకలు | 293 | 121 |
| జలాంతర్గాములు | 18 | 8 |





